విశాలాంధ్ర విశాఖపట్నం
బుధవారం 27, మార్చి, 2024

నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు

కలెక్టర్ ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎక్కడా తాగునీటి కొరత లేకుండా అవసరమైన ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. అలాగే తాగునీరు వృధా కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం కలిగించాలని చెప్పారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత అంశాలపై జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నీటి కొరత లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏలేరు, గోదావరి, గోస్తని, రాయపూడి, తాటిపూడి, మేహాద్రి గెడ్డ, గంభీరం, ముడసర్లోవ నుంచి తాగునీరు లభిస్తుందని అన్నారు. ఏలేరు నుంచి అధిక శాతం నీటిని విశాఖ సిటీ వరకు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కొన్నింటిలో నీటిసాంద్రత తక్కువగా ఉందని కలెక్టరుకు వివరించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ కె.వి.వి.చౌదరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ డి.సత్య నారాయణ, జీవిఎంసి వాటర్ సప్లై పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎన్ రవి, వాటర్ రీసోర్సెస్ పర్యవేక్షక ఇంజినీర్ కె.సూర్య కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ. శ్రీనివాసరావు, ఇతర విభాగాల ఇంజినీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన పోర్టు చైర్మన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 45వ అఖిల భారత ప్రధాన పోర్టుల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలను కోల్‌కతా(శ్యామ్ ప్రసాద్ ముఖర్జి పోర్టు అథారిటి) పోర్టు నిర్వహించింది. ఈ పోటీలలో విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఒక బంగారు, రెండు వెండి, రెండు బ్రాంజ్ పతకాలను సాధించారు. అఖిల భారత ప్రధాన పోర్టుల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన విశాఖ పోర్టు క్రీడాకారులు పోర్టు చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తును మంగళవారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను చైర్ పర్సన్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో విశాఖ పోర్టు క్రీడాకారుడు జీవీఎస్ రామారావు ముంబై పోర్టుకు చెందిన సునీల్ ఖేల్కర్‌పై నెగ్గి బంగారు పతకాన్ని సాధించారు. 50 ప్లస్ డబుల్స్ విభాగంలో పోర్టు క్రీడాకారుడు శ్రీధర్ రాజు వెండి పతకాన్ని సాధించారు. మెన్స్ డబుల్స్ విభాగంలో రామారావు, కే.రఘురామ్‌లు వెండిపతకాన్ని సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో రామారావు బ్రాంజ్ పతకాన్ని సాధించారు. మొత్తంగా విశాఖపట్నం పోర్టు టీం విభాగంలో బ్రాంజ్ పతకాన్ని సాధించింది. చైర్ పర్సన్‌ను కలిసిన వారిలో పోర్టు కార్యదర్శి, మెంబర్ ఎంపిఎస్బిబి టి.వేణుగోపాల్, సీనియర్ డిప్యూటీ సీఏఓ శివకుమార్, పోర్టు అధికారులు ఉన్నారు. వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

మేధో హక్కులపై గీతంలో కార్యశాల

విశాలాంధ్ర - మధురవాడ: మేధోహక్కులపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. గోవా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్ బంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రస్తుత శాస్త్ర సాంకేతిక యుగంలో మేధోహక్కుల ప్రాధాన్యత పెరుగుతోందని వివరించారు. నూతన ఆవిష్కరణలను వాణిజ్య పరంగా ప్రయోజనకరంగా మార్చుకో వాలంటే మేధోహక్కులు పొందడం అవసరమని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బొత్సను సన్మానించిన ఇల్లాపు

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గం నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బొత్స సత్యనారాయణ ను ఆయన కుమారుడైన బొత్సా సందీప్‌ను విశాఖ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇల్లాపు వెంకట్ జగన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో భీమిలి ఎమ్మెల్యేగా అవంతి శ్రీనివాసరావు విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

ఏయూను సందర్శించిన వెస్టన్ ఆస్ట్రేలియా ప్రతినిధులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని వెస్టన్ ఆస్ట్రేలియా ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. వెస్టన్ ఆస్ట్రేలియా ఇన్వెస్టెంట్ అండ్ ట్రేడ్ కమీషన్ (ఇండియా-గల్ఫ్) సహీద్ చౌదరి, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ ఆంటోని జోసఫ్‌లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి చెక్‌పోస్ట్ వద్ద ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర - ఆనందపురం: సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో బి.శ్రీనివాసరావు, ఎడిషనల్ ఎస్పీ వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు వారి పర్యవేక్షణలో భీమిలి క్రాస్ రోడ్ వద్ద ఉన్న పోలీస్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్‌తో గంజాయి, అక్రమ మద్యం, ఇతర మత్తుపదార్థాలు, అక్రమ నగదు రవాణా కొరకు వాహనాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సబ్ ఏఈ ఎస్‌యు.సుబ్బారావు, సిఐ రాజులనాయుడు, భీమిలి సబ్ సీఐ వి.రామకృష్ణ, ఎస్సైలు పి.చిన్నంనాయుడు, వి.వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి ఉత్సవాలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం తునవలస గ్రామంలో మంగళవారం ఘనంగా బంగారమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహించారు. గ్రామం మొత్తం పండుగ శోభ సంతరించుకుని గ్రామ మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగింది. ప్రతి ఏడాది నిర్వహించినట్లు ఈ ఏడాది కూడా అమ్మవారు పండుగను ఎంతో ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి తునివలస బంగారమ్మ తల్లి అని అన్నారు. గ్రామ ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.37కోట్లు



విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామివారి హుండి ఆదాయం రూ. 1,37,41,053లు నగదు లభించింది. భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులుగా హుండిలో బంగారం 000.089.900 మిల్లి గ్రాములు, వెండి 9 కెజిల 350 మిల్లి గ్రాములు. యు.ఎస్.ఏ 171, ఖతర్ 11 డాలర్లు, మలేషియా 119 డాలర్లు, ఆస్ట్రేలియా 160 డాలర్లు, ఒమన్ 1,500 రియల్, యూఏఇ 45 దిరం, సౌదీ అరేబియా 16 సౌదీ రియల్, సింగపూర్ 11 డాలర్లు, యురో 20, నేపాల్ 5 విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. హుండి లెక్కింపులో దేవస్థానం సిబ్బంది తోపాటు శ్రీహరి, శ్రీవారి సేవా సంస్థలు పాల్గొన్నాయి.

బెహరాను కలసిన క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ వైసీపీ 91వ వార్డు నుండి క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు రేఖ ఉషారాణి, ఎస్సీ విభాగం అధ్యక్షులు గొటివాడ దానియేలు క్లస్టర్ 4లో నియమితులైన సందర్భంగా జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు వారిని అభినందిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియపరచి ఓటర్లను ఆకర్షించి ఆనంద్ కుమార్ చేస్తున్న అభివృద్ధిని, వ్యక్తిగతంగా చేస్తున్న కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేరెళ్ల సత్యనారాయణ రెడ్డి, కడితి రాజు, గొడ్డు నాగరాజు, రాజేశ్వరి, ఆర్‌పి సుబ్బలక్ష్మి వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఎఫ్‌డీఏ శాస్త్రవేత్త

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరి కాలోని ఎఫ్‌డీఏ సీనియర్ శాస్త్రవేత్త వై.శ్రీరామ కృష్ణయ్య మంగళవారం సందర్శించారు. ఏయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి, పూర్వ ఆచార్యుడైన వై.శ్రీరామ కృష్ణయ్య ముందుగా కళాశాల ఆచార్యులతో సమావేశమయ్యారు. ఫార్మ రంగంలో జరుగుతున్న మార్పులు, అభివృద్ధిపై చర్చించారు. ఫార్మ కశాలలో జరుగుతున్న నూతన అభివృద్ధి కార్యక్రమాలను, నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఏయూ ప్రగతికి తాను సైతం కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున శ్రీరామ కృష్ణయ్యను వీసీ ప్రసాద రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్య ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అదీప్ రాజ్

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని పెదగాడి గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం 26వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెదగాడి గ్రామ సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్, గ్రామ పెద్దలు బడి కృష్ణ, క్యాంటీన్ కృష్ణ, పరవాడ వైస్ ఎంపీపీ బంధం నగేష్, నారాయణ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు విషయంపై కేంద్రంపై జగన్ ఒత్తిడి తేలేదు

విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

విశాలాంధ్ర - గాజువాక: స్టీల్‌ప్లాంట్ విషయమై ఒక్కసారైనా ముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తెచ్చారా? అని ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ప్రశ్నించారు. మంగళవారం జరిగిన గాజువాక నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న విశాఖ పార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి ఎంవి శ్రీ భరత్, గాజువాక నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, జనసేన నుంచి కోన తాతా రావు, బీజేపీ నుంచి కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గాజువాకలో 70 వేల పైచిలుకు మెజారిటీ రావాలని నేతలు పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్‌ని తిట్టడానికే అమర్నాథ్‌కు మంత్రి పదవి ఇచ్చారని, ఓటు రూపంలో అమర్నాథ్‌కు బుద్ధి చెప్పాలని అందుకు సమర్థతతో ముందుకు సాగాలని కూటమి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికే పవన్ కల్యాణ్ తెదేపాతో పొత్తు పెట్టుకున్నారన్నారు. ఉక్కుపై కేంద్రంలో గట్టిగా మాట్లాడేందుకు మెజారిటీ రూపంలో చూపాలన్నారు. గాజువాక నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశంలో మూడు పార్టీలకు చెందిన నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కోన తాతారావు, కారణం రెడ్డి నరసింగ రావు సహా ఆ పార్టీల నాయకులు, కార్యకార్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్థలాన్ని కబ్జా చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - భీమిలి: అంబేద్కర్ భవనానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తే సహించేది లేదని దళిత సంఘాలు హెచ్చరించాయి. భీమిలి నియోజకవర్గ పరిధి పాత ఋషికొండ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి, భవనానికి గతంలో కేటాయించిన 100 గజాల స్థలాన్ని కబ్జా చేస్తే సహించేది లేదని దళిత సంఘాలు హెచ్చరించారు. పాత ఋషికొండలో 16 మంది దళిత కుటుంబాలకు నివాస స్థలమును ఇవ్వగా అందులో అంబేద్కర్ సామాజిక భవనానికి 100 గజాల స్థలమును కేటాయించారని స్థానిక దళితసంఘ ప్రతినిధులు తెలిపారు. గతంలో కేటాయించిన స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టగా దళిత కుటుంబాల కొరకు ప్రభుత్వ నీటి బోరు కూడా వేయడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని స్థానికంగా ఉన్న వాచ్‌మెన్ అంబేద్కర్ విగ్రహం, ప్రభుత్వ నీటి బోరుని కలుపుకుని ప్రహరీ నిర్మించుటకై ప్రేమ సమాజం పెద్దలతో కలిపి కుట్ర చేస్తూ స్థానిక దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై జిల్లా అధికారులను కలిసి నివేదిస్తామని తమకు న్యాయం జరగలేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు, దళిత సీనియర్ నాయకులు పారువల్లి రామారావు, బంకవల్లి కొండబాబు, కె.శివ, బోనిల మహేష్, తాటిపూడి సత్తిరాజు, బోనిల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మృతునికి పీవీఎస్ ట్రస్టు అంత్యక్రియలు

విశాలాంధ్ర - మల్కాపురం: అందరూ ఉన్నా అభాగ్యునిగా జీవిస్తూ పారిశ్రామిక వాడలో ప్రాణాలు విడిచిన ఓ అభాగ్యునికి పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ అన్నీతానై ఆఖరి మజిలీ నిర్వహించారు. ఇప్పటికే అనేక అనాధ మృతులకు సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించిన ఆయన మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే పారిశ్రామిక ప్రాంతం కోరమండల్ ప్రాంతానికి చెందిన కోమటి అప్పలనాయుడు పరిసర ప్రాంతాలలో యాచకత్వం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నడిరోడ్డుపై కొనఊపిరితో ఉన్న అప్పలనాయుడుని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దహనసంస్కారాలు నిర్వహించేందుకు ముందుకు రాక పోవడంతో మల్కాపురం పోలీసులు పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు వ్యవస్థాపకులు పివి సురేష్‌కు సమాచారం అందించారు. ట్రస్టు సభ్యుల సహకారంతో మృతునికి చట్టప్రకారం పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శాంతిభద్రతల విభాగం ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ పతివాడ సతీష్, ట్రస్టు సభ్యులు రమేష్, శ్రీను, హరి, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గీతం ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - మధురవాడ: స్థానిక రుషికొండ, వాడపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలన్నారు. ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాధ్యతను మరవకూడదన్నారు. గీతం విద్యార్థులు పాఠశాలలను దత్తతకు స్వీకరించి నిరంతర కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ గురించి వివరించారు. 100 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మూడు రోజుల పాటు పాఠశాల విద్యార్థులతో గడిపి వారికి వివిధ పోటీలను నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. బాలికలకు ఆరోగ్య పరమైన సూచినలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్.త్రినాద్‌రావు, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు డాక్టర్ కె.వనిత, కె.యసోధ, వి.సత్యఅరుణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షులుగా గండి బాబ్జి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ గండి బాబ్జిని విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పార్లమెంటరీ అధ్యక్షులుగా ఉన్న పల్లా శ్రీనివాసరావు గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నందున, గండి బాబ్జి దక్షిణ నియోజకవర్గంలో టిడిపి నుండి టిక్కెట్ ఆశించినప్పటికీ కూటమి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అవకాశం దక్కడంతో పార్టీపై తీవ్రంగా అసంతృప్తి చెందిన గండి బాబ్జిని విశాఖపట్నం అధ్యక్షులుగా నియమించారు. ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబుతో గండి బాబ్జి సమావేశమయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ పార్లమెంటరీ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించే బాధ్యత గండి బాబ్జికి అధినేత అప్పగించినట్లు తెలిసింది. బిజెపి, జనసేన పార్టీల శ్రేణులను కలుపుకుంటూ కూటమి అభ్యర్థులను విశాఖలో గెలిపించే బాధ్యత టీడీపీ అధ్యక్షులుగా గండి బాబ్జికు అప్పగించడంతో ఆయన మరింత చురుగ్గా విశాఖలో పార్టీ కార్యక్రమాలను ప్రచారాన్ని విస్తృతం చేస్తారని కార్యకర్తలు తెలిపారు.

విశాఖ డ్రగ్స్ రవాణాలో జగన్ హస్తం

టీడీపీ నేత గండి బాబ్జి ఆరోపణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో జగన్ హస్తం ఉందని తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ విశాఖలో ఎప్పటి నుంచో డ్రగ్స్ మాఫియా జరుగుతుందని, ఎక్కడ గంజాయి పట్టుబడిన వాటి మూలాలు విశాఖలో కనిపిస్తున్నాయన్నారు. విశాఖలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడితే సీబీఐ విచారణ చేయడానికి అవకాశం ఇవ్వలేదని, డ్రగ్స్ మాఫియా తతంగాన్ని అధికార పార్టీ నాయకులు మాయచేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో జగన్ హస్తం ఉందని, సంధ్య ఆక్వా సంస్థ ప్రతినిధి కూనం పూర్ణచంద్రరావుకు వైసీపీతో సంబంధాలు ఉన్నాయిని ఆరోపించారు. విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్ర శేఖర్ ప్రమేయం ఉందని తెలుస్తోందని చెప్పారు. విశాఖలోని అనేక కళాశాలలలో విచ్చలవిడిగా డ్రగ్స్ దొరుకుతున్నాయన్నారు. మత్తు పదార్థాలలో ఆంధ్రప్రదేశ్‌ను జగన్ నెంబర్ వన్ స్థానానికి తీసుకు వెళ్లారని, యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. విశాఖ ను వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని, మరో సారి జగన్‌కు అవకాశం ఇస్తే విశాఖ మరింత నాశనం అవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో పొర పాటున జగన్‌కు ఓటు వేస్తే జీవితాలను నాశనం చేసుకున్నట్లే అని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రభుత్వ అధికారులు వైసీపీ పార్టీ నాయకులకు మద్దతుగా పని చేస్తున్నారనన్నారు. అధికార దుర్వినియోగనికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేశారు సమావేశంలో చిన రెహమాన్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన మహా యజ్ఞం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి సమక్షంలో ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే శ్రీ సుదర్శన నరసింహ మహా యజ్ఞం మంగళవారం అంకురార్పణతో ప్రారంభం అయింది. ఆలయ వైదిక పెద్దల పర్యవేక్షణలో జరిగింది. యజ్ఞంలో పాల్గొనే భక్తులకు ఉదయం అల్పాహారం అందజేస్తామని, అలాగే మధ్యాహ్నం ప్రత్యేక అన్నప్రసాదం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే అంతరాలయంలో ప్రత్యేక దర్శనం కల్పిస్తామని, ఉభయదాతలతో పాటు మరో ఇద్దరికి ఈ సదుపాయాలు అందుతాయని ఈఓ పేర్కొన్నారు. యజ్ఞంలో పాల్గొనేవారికి శాలువ, రవిక, కళ్యాణం లడ్డు, అరకిలో పులిహోర ప్రసాదం, స్వామివారి రాగి ప్రతిమ అందజేస్తారన్నారు. దూర ప్రాంతాల నుంచి యజ్ఞానికి వచ్చే భక్తులకు వసతి సదుపాయం కూడా దేవస్థానం సమకూర్చుతుందని అయన అన్నారు.

కేఏ పాల్ గెలుపు విశాఖకు ఎంతో అవసరం

తెలంగాణ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు బాబు మోహన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పేద ప్రజలకు దశాబ్దాల కాలంగా సేవలందిస్తున్న సేవా తత్పరుడు అవినీతి రహిత వ్యక్తిత్వం గల కేఏ.పాల్ లాంటి వారు విశాఖపట్నంకి అవసరమని తెలంగాణ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు బాబు మోహన్ అన్నారు. పాల్‌ని గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కోరారు. మంగళవారం న్యూ కాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి సేవ చేయడమే విధిగా పెట్టుకుని కష్టాల్లో ఉన్న నిరుపేదలకు ఆయన సహాయం చేస్తున్నారన్నారు. కెఏ.పాల్‌ను ఖచ్చితంగా గెలిపించి పార్లమెంటుకు పంపించాలన్నారు. పాల్ వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, పెట్టుబడులు కూడా తేగలిగే సత్తా ఆయనకు ఉందన్నారు. ఇప్పుడు అన్ని పార్టీలు దోపిడీ కోసమే పోటీ చేస్తున్నాయన్నారు. నేను ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించనని తెలిపారు. కేఏ.పాల్ నన్ను తెలంగాణ అధ్యక్షునిగా నియమించారని, వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు చెప్పారు. పార్టీ ప్రతినిధి ఏసుపాదం మాట్లాడుతూ ఏ ప్రభుత్వ అధికారంలోకి వచ్చినా లక్షల కోట్లు అప్పులు తెచ్చి జనం మీద రుద్దుతున్నారన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం 80 వేల కోట్లు వడ్డీ కట్టవలసి వస్తుందని, ఇదంతా ప్రజల నుంచే వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రవి, బాబ్జి పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ పేదకుటుంబాన్ని ఆదుకోండి

విశాలాంధ్ర - భీమిలి: ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డ భీమిలి జోన్ 3వ వార్డు బోయవీధి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కాసరపు నూకరాజు కుటుంబాన్ని ఆర్థిక సహాయం ద్వారా ఆదుకోవాలని దాతలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. విశాఖ నోవెటెల్లో జిమ్ కోచ్‌గా పనిచేస్తున్న కాసరపు నూకరాజు (39) మూడు నెలల క్రితం తెల్లవారుజామున డ్యూటీకి బయలుదేరుతుండగా భీమిలి శివాలయం గుడివద్ద కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్లను గమనించక అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయం కాగా వెంటనే విశాఖపట్నంలో ఉన్న కేజీహెచ్‌కి 108లో తరలించి చికిత్స చేయించినట్టు తెలిపారు. ఆసుపత్రిలో మూడు వారాలకు పైగా ఉన్నా చికిత్సలో ఎటువంటి పురోగతిలేదని వాపోయారు. కాళ్ళు, చేతులు చలనం లేని స్థితిలో బోయవీధిలో గల వారింటికి తీసుకొని వచ్చారని ఇక్కడే స్థానిక వైద్యుల పర్యవేక్షణలో ఫిజియో థెరఫి చేస్తూ నేటివరకు ప్రాధేయపడ్డారన్నారు. వైద్యుల సలహామేరకు మంగళవారం ఉదయం విశాఖపట్నంలో ఉన్న ఏ 1 ఆసుపత్రికి మరలా అంబులెన్స్‌లో తీసుకొని వెళ్లారని ఈ పేద కుటుంబానికి సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. వివరాలకు 9052424332ని సంప్రదించాలన్నారు.

పోషకాహారం కలిగిన అల్మండ్స్‌తో అనేక ప్రయోజనాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: బాదములతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని ప్రతిరోజు ఆహారంలో భాగం చేసుకోవాలని నటి సోహా అలీ ఖాన్, మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ డైటీటిక్స్ హెడ్ రితికా సమద్దర్, స్కిన్ ఎక్స్‌పర్ట్ కాస్మోటాలజిస్ట్ డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా, న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఒక అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఉత్సాహభరితంగా, రంగులతో జరుపుకునే ఆనందకరమైన హెూలీ పండుగ సందర్భంగా ఇచ్చిపుచ్చుకునే బహుమతులలో ఆల్మండ్ ను భాగం చేయాలన్నారు. పండుగ విందులలో, తీసుకునే ఆహారంలో వీటిని చేర్చాలన్నారు. ఆహారంలో కొన్ని బాదంపప్పులను చేర్చుకోవడం రుచిని మెరుగుపరచడంతోపాటు కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందన్నారు. విటమిన్ ఈ, మెగ్నీషియం, ప్రోటీన్, రిబోఫ్లావిన్ జింక్ వంటి 15 ముఖ్యమైన పోషకాల మూలం బాదం అని, గుండె ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడం, బరువును నిర్వహించడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడం వంటి ఆరోగ్య ప్రయోజనాలను అందించే సామర్థ్యానికి ఇది ప్రసిద్ధి చెందిందన్నారు.

ప్రత్యేక చార్టెడ్ విమానాన్ని ప్రారంభించిన థమ్స్ అప్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: థమ్స్ అప్, కోకా-కోలా కంపెనీ నుండి భారతదేశపు స్వదేశీ పానీయాల బ్రాండ్ అయిన థమ్స్ అప్, ఐ సీసీ టీ20 ప్రపంచ కప్‌కు తన తాజా ప్రచారంలో భాగంగా 'వరల్డ్ కప్ కా తూఫానీ టూర్'లో భాగంగా తూఫాన్: ది థమ్స్ అప్ బ్రాండ్ ప్రత్యేక చార్టర్డ్ విమానాన్ని ప్రారంభించినట్టు కోకా కోలా ఇండియా, సౌత్-వెస్ట్ ఆసియా సీనియర్ కేటగిరీ డైరెక్టర్ మిస్టర్ టిష్ కాండేనో తెలిపారు. ఐ సీసీ టీ 20 ప్రపంచ కప్ యొక్క అధికారిక పానీయ భాగస్వామిగా, థమ్స్ అప్ అభిమానుల నిబద్ధతను పునర్నిర్వచించడాన్ని కొనసాగిస్తుందన్నారు. క్రీడా రంగంలో అభిమానుల అనుభవాల కోసం కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తుందన్నారు. ఈ సంవత్సరం, థమ్స్ అప్ క్రికెట్ ఔత్సాహికులకు ప్రత్యేకమైన థమ్స్ అప్ విమానంలో వెస్టిండీస్‌కు మరపురాని సాహసయాత్రను ప్రారంభించేందుకు ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోందన్నారు. ఈ థ్రిల్లింగ్ ప్రచారంలో భారతదేశం యొక్క ప్రియమైన క్రికెట్ స్టార్లు, యువరాజ్ సింగ్ వీరేంద్ర సెహ్వాగ్ ఉన్నారనీ, తూఫాన్‌లో సీటు గెలుచుకునే అవకాశం కోసం థమ్స్ అప్ ప్యాక్‌ని స్కాన్ చేయమని వినియోగదారులను ప్రోత్సహించారన్నారు.

నాయి బ్రాహ్మణులకు అండగా నిలుస్తా

విశాలాంధ్ర - పెందుర్తి: నియోజకవర్గ పరిధిలోని నాయి బ్రాహ్మణులకు అండగా నిలుస్తానని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ హామీ ఇచ్చారు. పెందుర్తి నాయిబ్రాహ్మణ సంక్షేమ సేవ సంఘం ప్రతినిదులు మంగళవారం ఉదయం ఎమ్మెల్యేను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని ఒరవడి కొనసాగాలంటే మళ్ళీ వైసీపీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు మల్లువలస సన్ని బాబు, అరిపాక సత్యనారాయణ, కింతాడ అప్పారావు సంఘం ప్రతినిదులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన నీలగిరి తోట

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 ఎకరాల నీలగిరి తోట అగ్నికి ఆహుతి అయింది. వివరాల్లోకెళ్తే అనందపురం మండలం సొంత్యాం రెవెన్యూ పరిధిలో మింది వానిపాలెం సర్వే నెంబర్ 347/ లో సుమారు 3 ఎకరాల నీలగిరి తోట సవరవెల్లి రాంబాబు తండ్రి నారాయణ తాలూకా తోట అగ్నికీలలో కాలిపోయింది. అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది కొంతమేర మంటలను అదుపు చేశారు. సుమారు 3 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని, అయితే మధ్యాహ్నం వేళల్లో తోటల కుర్రవాళ్ళు సిగరెట్లు కాల్చే ప్రక్రియలలో అగ్గి అంటుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా భూమి యజమాని విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీభరత్‌ను కలిసిన కంటుభుక్త

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను బీజేపీ భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, జిల్లా మత్స్యకార సెల్ కన్వనర్ వాసుపల్లి శ్రీహరిలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కూటమి గెలుపు సమీకరణాలపై చర్చించారు.

ఉత్తర నియోజకవర్గంలో పలువురు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీఎం క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్ సమక్షంలో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో ఉత్తర నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కేకే రాజు సారధ్యంలో పలువురు సీనియర్ నాయకులు చేరారు. మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా ఉన్న జి.వి.రవిరాజు , జనసేన నేతగా ఉన్న బొగ్గు శ్రీనివాస్, బొడ్డేటి అనురాధ లు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి, గాజువాక వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ నార్త్ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కే.కే. రాజులు పాల్గొన్నారు.

ఇండ్కల్ టెక్నాలజీస్ తన 2024 శ్రేణి ఏసర్ ఎయిర్ కండీషనర్‌ల పరిచయం

విశాలాంధ్ర -విశాఖపట్నం: భారతదేశంలోని ఏసర్ గృహోపకరణాల కోసం అధికారిక అనుమతులు ఇండ్కల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అందరూ ఆసక్తిగా వేచి చూస్తున్న 2024 శ్రేణి ఏసర్ ఎయిర్ కండీషనర్‌లను విడుదల చేయడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. హెూమ్ కూలింగ్ అనుభవాలను పునర్నిర్వచించేందుకు రూపొందించిన ఈ ఎయిర్ కండీషనర్లను 1.0 టన్ను- 3 మరియు 5 స్టార్, 1.5 టన్ను - 3 మరియు 5 స్టార్, మరియు 2.0 టన్ను - 3 స్టార్ కెపాసిటీలలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్కిటిక్ ర్యాప్ కూలింగ్‌తో సహా ఐ సెన్స్, కూల్‌స్పియర్ ఎయిర్‌ఫ్లో మేనేజ్‌మెంట్ తదితర అత్యాధునిక సాంకేతికతలను ఈ ఉత్పత్తుల శ్రేణుల్లో ఉన్నాయి. ఇది లీనమయ్యే వినియోగదారు అనుభవానికి ప్రాధాన్యతనిచ్చే, కొత్త శ్రేణి ఎయిర్ కండీషనర్లు దేశవ్యాప్తంగా ఆఫ్‌లైన్ రిటైల్ ఛానెళ్లలో విడుదలై అందుబాటులోకి వచ్చాయి.

రికార్డు స్థాయిలో వాల్తేరు రైల్వే ఆదాయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వాల్తేర్ డివిజన్ 10,000 కోట్లు ఆదాయాన్ని సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. మొదటిసారిగా 10,000 కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఐదు రోజుల ముందు ఈ అద్భుతమైన విజయాన్ని సాధించి, విభజనకు చారిత్రాత్మక ఘట్టమని డివిజనల్ రైల్వే మేనేజర్, సౌరభ్ ప్రసాద్ తెలిపారు. 2022-23తో పోలిస్తే 10% కంటే ఎక్కువ వృద్ధిని సూచిస్తుందని, ఈ విజయానికి కస్టమర్-ఫోకస్డ్ స్ట్రాటజీలు, కస్టమర్‌లతో సన్నిహిత సమన్వయం, కార్యాచరణ సామర్థ్యం మెరుగుదలలు, సామర్థ్య మెరుగుదలలు, ప్రయాణీకుల సౌకర్యాల నవీకరణలు మరియు సమర్థవంతమైన సిబ్బంది నిర్వహణ వంటి అనేక అంశాలు ఆపాదించబడ్డాయన్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తాం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విశ్వ బ్రాహ్మనులను బీసీ బీ నుండీ బీసీ ఏలోకి మార్చడానికి కృషి కృషి చేస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల అన్నారు. అనకాపల్లి పట్టణంలో విశ్వ బ్రాహ్మణ సోదరుల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపున కు అందరూ కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ పిలుపునిచ్చారు. సైకో జగన్ రెడ్డి పాలనలో బీసీలకు రక్షణ లేదని అన్నారు. విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ను అత్యధిక నిధులు ఇస్తాం అని అన్నారు. టీడీపీ-జనసేన- బీజేపీ సంయుక్త ప్రభుత్వం రాగానే విశ్వకర్మ జయంతినీ అధికారకంగా నిర్వహిస్తాం అనిమాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. వైసీపీ ఆరాచక పాలన నుండి విముక్త ఆంధ్రప్రదేశ్ రావాలంటే తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని అనకాపల్లి అభివృద్ధికి సహకరించాలని విశ్వబ్రాహ్మణ సోదరులకు పిలుపునిచ్చారు.

వెస్ట్ క్యూ 6 బెర్త్ ఆధునీకరణ పనులకు ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పిపిపి పద్దతిలో వెస్ట్ క్యూ 6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణపై విశాఖ పోర్టు, ఇంటిగ్రెటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం జరిగింది. విశాఖపట్నం పోర్టును ల్యాండ్ లార్డ్ పోర్టుగా తీర్చిదిద్దేందుకు ఛైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు సమర్థ నేతృత్వంలో పోర్టులో సమర్దవంతంగా అసెట్ మానిటైజేషన్ విధానం అమలు చేస్తున్నారు. ఈ కోవలోనే పోర్టులోని ఇన్నర్ హార్బర్ లోని వెస్ట్ క్యూ 6 బెర్త్‌ను పాక్షికంగా యాంత్రీకరించేందుకు మంగళవారం ఇంటిగ్రెటెడ్ కార్గొ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పంద పత్రాలపై విపిఏ సంతకాలు చేసింది. 30 ఏళ్ల కాలపరిమితి కలిగిన ఈ ఒప్పందంలో భాగంగా వెస్ట్ క్యూ సిక్స్ బెర్త్ పాక్షిక యాంత్రీకరణ పనులను 18 నెలల్లో సదరు సంస్థ పూర్తి చేయాల్సి ఉంది. వెస్ట్ క్యూ 6 బెర్త్ 255 మీటర్ల పొడవు 14 మీటర్ల డ్రాఫ్ట్ తో 210 మీటర్ల పొడవైన వెసల్స్ ను హ్యాండిల్ చేసే సమార్థ్యం కలిగి ఉంది. పాక్షిక యాంత్రీకరణలో భాగంగా బెర్త్ పైన 100 టన్నుల లిఫ్టింగ్ సామర్థ్యం కలిగి గంటకు 1200 టన్నుల హ్యాండ్లింగ్ సామర్థ్యంతో పని చేసే రెండు మొబైల్ హార్బర్ క్రేన్ లను సదరు సంస్థ ఏర్పాటు చేస్తుంది. అంతే కాకుండా రెండు మొబైల్ హెూపర్స్ , నీటి శుద్ధి చేయడం, క్రేన్స్, లోడర్లు , ట్రక్స్, ఫోర్క్ లిఫ్ట్ లు అందుబాటులోకి వస్తాయి. ఈ పనుల కోసం సదరు సంస్థ 165.70 కోట్ల రూపాయలను వెచ్చించనుంది. ఈ పనుల వల్ల వెస్ట్ క్యూ 6 వెర్త్ లో అన్ని రకాల సరుకును రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది. పనులు పూర్తైయ్యాక సరుకు రవాణా సామర్థ్యం ఏడాదికి 5.18 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుతుంది. ఈ బెర్త్ కు ఆనుకుని 2.5 ఎకరాల ప్రదేశం కలిగి ఉండటం వల్ల తాత్కాలికంగా సరుకును నిల్వ చేయడానికి అవకాశం కలుగుతుంది. అంతే కాకుండా బెర్త్ కు 2 కిలోమీటర్ల పరిధిలో 12.5 ఎకరాల సరుకు నిల్వ ప్రదేశాన్ని కలిగి ఉంది. యాంత్రీకణ పనుల ద్వారా ప్రత్యక్షంగా 100 మందికి పైగా పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

అభిమానుల నిర్ణయం మేరకు ఇండిపెండెంట్‌గా పోటీ

గుంటూరు వెంకట నరసింహారావు

విశాలాంధ్ర - పెందుర్తి: అభిమానులు కాపు సంఘం నాయకులు నిర్ణయం మేరకు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాపు సంఘం నాయకులు గుంటూరు వెంకట నరసింహారావు తెలిపారు. సోమవారం వైసీపీకి రాజీనామా చేసిన నరసింహారావు వాట్సప్ గ్రూపు ద్వారా జిల్లా కాపు సంఘం నాయకులు అభిమానులతో తన పోటీపై ఒపీనియన్ పోల్ నిర్వహించారు. ఇందులో కొందరు కాంగ్రెస్ లో చేరాలని, మరికొందరు జనసేన సభ్యత్వం తీసుకోవాలని ప్రతిపాదించగా ఎక్కువమంది ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని నిర్దేశించినట్లు వెల్లడించారు. వారి అభిమతం మేరకు పెందుర్తి నియోజకవర్గ నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ పింక్ కలర్ షర్టు తనకు పంపించారని వెల్లడించారు. కాగా ఐ ఎన్ టీ యు సి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గత 30 ఏళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న గుంటూరు వెంకట నరసింహారావు కుటుంబానికి రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయని గొర్లె నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

హత్యాయత్నం కేసులో రౌడీ షీటర్‌కు యావజ్జీవ కరాగార శిక్ష

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: మర్డర్ కేసులో రౌడీ షీటర్‌కు 6వ ఏ డిజే జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ. 12,000/- జరిమానా విధించింది. ముద్దాయి కోలా వెంకట హేమంత్ కుమార్, రాధికా దేవిలకు యావజ్జీవ కారాగార శిక్ష, 12,000/- జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. ఫిర్యాదు దారుని ఫిర్యాదు ప్రకారం అక్కయ్యపాలెం వద్ద పద్మ భాస్కర ప్రకాష్ రెసిడెన్సీ, ఫ్లాట్ నెంబరు 502లో విజయా రెడ్డి (ఎక్స్ కౌన్సిలర్) గాజువాక అనే వ్యక్తి ఆమె భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ముద్దాయి హేమంత్ కుమార్ రాధిక దేవి ఇద్దరు కలిసి విజయా రెడ్డి యొక్క ఫ్లాట్ తీసుకుంటాం అనే కారణంతో అతనికి ఆమె భార్యకు దగ్గర అయ్యారు. తేదీ 25-02-2019న విజయా రెడ్డి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉండటంతో ఆమెకు ఫోన్ చేయగా ఫోన్ పనిచేయకపోవడంతో ముద్దాయి కోలా హేమంత్‌కు ఫోన్ చేయగా ఆమెను అక్కయ్యపాలెం హైవే వద్ద తన కారులో ఆమెను దింపి వెళ్ళిపోయాను అని చెప్పారు. ఎంత సేపటికీ అతని భార్య ఇంటికి రాకపోవడంతో బంధువులను సంప్రదించగా ఎవరి వద్దకు రాలేదని చెప్పడంతో అనుమానం వచ్చి, ఇంటి తాళం పగలగొట్టి చూడగా, బాత్రూంలో అతని భార్య తీవ్ర రక్తస్రావం జరిగి మరణించినట్లు, ఆమె బంగారు ఆభరణాలు కార్ కనిపించడం లేదు అని గుర్తించి వెంటనే నాల్గవ పట్టణ పోలీసులను సంప్రదించారు. నాల్గవ పట్టణ సి.ఐ సాకేటి శంకరరావు కేసు దర్యాప్తు చేసి, ముద్దాయిలిద్దరు కలిసి పథకం ప్రకారమే కిరాతకముగా విజయా రెడ్డి భార్యను హత్య చేయడము జరిగినది. ముద్దాయిలిద్దరిని అరెస్ట్ చేసి నగదు, బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. కాల్ డాటా, సి సి టివి ఫుటేజ్ ఇతర టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి ఛార్జిషీట్ ఫైల్ చేయడమైనది. ఈ కేసును ప్రాధాన్యత గల కేసుగా పరిగణించి ఏ.వెంకట రత్నం, డీసీపీ (క్రైమ్స్) వారు ట్రైల్ ను పర్యవేక్షించారు.

విచారణాంతరం ముద్దాయిలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.12,000/- జరిమానా విధించారు. పై కేసు నందు కన్విక్షన్ పడుటలో ప్రతిభ కనబరిచిన పీ.పీ శ్రీనివాస రావు కేసు ట్రయల్ జరగడంలో పూరోగతి చూపించిన నగర పోలీసు అధికారులను, నవీన్ కుమార్‌ని నగర పోలీసు కమిషనర్ డా.ఏ.రవి శంకర్ అభినందించడం జరిగింది. కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి, డి.జి.పి ఆదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్‌కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామని, కేసుల విషయంలో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్లతో మాట్లాడుతూ ఉండా లని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు.

"వాసుపల్లి" గెలుపునకు మత్స్యకారుల మద్దతు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మత్స్యకారుల సమస్యలను అసెంబ్లీలో కూడా లేవనెత్తి పరిష్కరించిన ఒకే ఒక్క మా దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను గెలిపించుకోవడం మా వంతు బాధ్యతని ఫిషింగ్ హార్బర్ బోటు ఓనర్స్ ముక్తకంఠంతో వెల్లడించారు. ఆసిల్ మెట్ట ఎమ్మెల్యే కార్యాలయంలో 100మంది పైగా బోట్ ఓనర్స్ వైసీపీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే వాసుపల్లి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోట్ ఓనర్స్ మాట్లాడుతూ మత్స్యకారులకు 50ఏళ్లకే పెన్షన్ పెట్టాలని అసెంబ్లీలో మాట్లాడి సాధించిన ఘనత తమ ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మత్స్యకారులకు ఇస్తున్న ప్రాధాన్యత నచ్చి పార్టీ లో చేరామని, మాకు స్థానికంగా అండగా ఉంటున్న ఎమ్మెల్యే వాసుపల్లిని అత్యధిక మెజార్టీతో గెలిపించికోవడం మా బాధ్యత అన్నారు. ఎటువంటి కష్టమన్న ఇంటిముందు వాలే నాయకుడూ, నిత్యం ప్రజాసేవకు పరితపించే వాసుపల్లి గణేష్ కుమార్ మాత్రమే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిషింగ్ హార్బర్ బోటు ఓనర్స్ చెన్నా అప్పారావు, వాసుపల్లి ఎల్లారావు, గంటా దాసు, దౌలపల్లి దాసు, కుంజుమాన్, బొడ్డు ఆనంద్, కే.అప్పన్న, అల్లిపిల్లి చిన్నారావు, మేడ ఎల్లయ్య, మైలపిల్లి చిన్న ఎర్రన్న, మైలపిల్లి ఎల్లయ్య తదితరులు పార్టీలో చేరారు.

దండుబజారులో ఆర్.టి.సి పార్సిల్ పాయింట్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజా ప్రయోజనర్థం ఆర్టీసీ పార్సిల్ సర్వీస్ పాయింట్ లను విశాఖ నగరంలో అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామని ఎ ప్రాంతంలో ఉన్న వారు ఆ ప్రాంతంలో వారి పార్సిల్లను పంపించుకునే విధంగా పాయింట్‌లను ఏర్పాటు చేశామని ఆర్‌టిసి కమర్షియల్ ఆపరేషన్స్ డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు, వాల్తైర్ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. దండుబజార్‌లో నిర్వాహకుడు సాయి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్సిల్ పాయింట్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకి సురక్ష ప్రయాణంతో పాటు, పార్సిల్ విభాగంలో భద్రతా ప్రమాణలతో సరుకు రవాణా చేస్తుందన్నారు. ఎ ప్రాంతంలో ఉన్న వారు ఆ ప్రాంతం లోనే పార్సిల్స్ పంపిణి చేసుకునే అవకాశం కల్పించేందుకు ఈ పార్సిల్ పాయింట్ లను ఏర్పాటు చేసే అవకాశం కల్పించామన్నారు. ఈ జగదాంబ పాయింట్‌ను దండు బజారులో సాయి ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. ఈ దండుబజారు పాయింట్‌ను జగదాంబ చుట్టు ప్రక్కల ప్రాంత ప్రజలందరూ డోమస్టిక్ తో పాటు కమర్షియల్ పార్సిల్ పంపిణీకి వినియోగించుకుని ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినియోగదారుడు ప్రసాద్ మాట్లాడుతూ గతంలో దూర ప్రాంతాలకు సరుకులు రవాణా చెయ్యాలంటే చాలా ఇబ్బంది ఉండేదని ఇప్పుడు ఈ పాయింట్ ఏర్పాటుతో పార్సిల్స్ పంపించుకోవడం సులభంగా ఉంటుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వైసీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు ఎదురువానిపాలెం గ్రామం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన యువత సుమారు 50 కుటుంబాలు మంగళవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా ప్రజలకు అందజేస్తున్న జగనన్న పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గపు పరిశీలకులు పీలా ఉమారాణి, వార్డ్ కార్పొరేటర్ గులివెందుల లావణ్య, వార్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, మండల క్లస్టర్ 2 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంగారాం ప్రసాద్, మండల క్లస్టర్ యువజన విభాగం అధ్యక్షులు బర్రీ సంతోష్, మహిళా విభాగం అధ్యక్షురాలు మల్ల ధనలత, సచివాలయం కన్వీనర్లు ఎదురీరి రాజు, ధర్మాల వేణుగోపాల్ రెడ్డి, ఓదురు వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తోనంగి వెంకటరమణి, చుక్కా వరలక్ష్మి, సీనియర్ నాయకులు గొందేసి పేద సత్యనారాయణ, రెడ్డి చిన్న సత్యనారాయణరెడ్డి, బెల్లంకొండ వరహాలు, సాల్మన్ రాజు, అప్పన్న , సచివాలయ కన్వీనర్లు 58వ వార్డ్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.